# గుణపాఠం

కథ

ఎస్.ఆర్.పృథ్వి




రవి గౌరవ మర్యాదలున్న కుటుంబంలోంచి వచ్చినవాడు. సంస్కారమెరిగినవాడు. చిన్న ప్రభుత్వోద్యోగం. భార్య,ఇద్దరు పిల్లలతో సంసార నావ ప్రశాంతంగా సాగిపోతోంది. దురలవాట్లు మచ్చుకైనా లేవు. అభిమానానికి లోటు లేదు. నలుగురు ఆడవాళ్ళు కలిసివెళుతుంటే, వాళ్ళ ప్రక్కగా నడవడానికి జంకుతాడు. ఆడవాళ్ళతో మాట్లాడడమంటే ఇబ్బందే. అయితే, కోర్కెలు సహజసిద్ధం కదా! వాటిని నెమరువేసుకోవడమే గాని, తీర్చుకోవడానికి ప్రయత్నంచే సాహసమూ లేదు.

అలాంటి రవికి, అతనికి తెలియకుండానే ఒక వింత అలవాటు ప్రారంభమయింది. రోజూ ఆఫీసుకి వెళ్ళేది బడుగువర్గం నివసించే పేట మీదుగా. దాదాపు రవి వెళ్ళే దారి పొడవునా, పేదవాళ్ళ ఇళ్ళే కనపడతాయి. ఎక్కువ మంది ఆడవాళ్ళు, ఇంటి వరండాలోనో, గుమ్మం ముందరో తారసపడుతూ వుంటారు. రవి మనసులో ఏదో సంచలనం. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు, తిరిగి ఆఫీసు నుండి ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు కనిపించిన ఆడవాళ్ళ వంక తదేకంగా చూడడం ఆరంభమయింది. తను అలా చూస్తే, వాళ్ళు ఏమనుకుంటారో అన్న సంశయం ఏమాత్రం లేదు. అలా రవి వస్తూ, పోతూ వున్న సమయంలో కనిపించిన ఆడవాళ్ళ వంక చూడటం, తిరిగి ఎవరైనా తనవంక చూస్తే వాళ్ళ కళ్ళల్లో చూపు కలపడం అలవాటుగా మారిపోయింది.

ఈ నేపథ్యంలో రోజూ ఒకామె రవి వచ్చే సమయానికి, ఇంటి అరుగు మీద కూర్చునుండటం, రోజూ రవి ఆమె కళ్ళల్లోకి చూసే ప్రయత్నంలో కొద్దిరోజులు గడిచాయి. అది గమనించిన ఆమె, రవి చూపులో వెలుతురు ఒత్తి వెలిగించింది. వాళ్ళ చూపుల్లోని భావాలు పలకరించుకునే సమయంలో దారి మరో మలుపు తిరిగింది.

ఆ దారిలో మరో కొత్తసౌందర్యం రవి మనసులో కితకితలు పెట్టింది. ఆమె పేరు మాధవి. ఆ ఊరికి కొత్తగా వచ్చిన స్కూలుటీచరు. ఇంకా వివాహం కాలేదు. కాని, జీవితాన్ని చదివిన అనుభవం ఉంది. రవి ఆఫీసుకు వెళ్ళే సమయం, మాధవి స్కూలుకు

వెళ్ళే సమయమూ ఒకటే. పైగా వెళ్ళే దారికూడా ఒకటే కావడం వల్ల, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒకరికొకరు ఎదురుపడుతూ వుంటారు. రవి 'అలవాటు మాధవిమీద ఆయుధంలా ప్రయోగించబడింది. మొదట్లో మాధవి, రవి తన వంక చూడటం మామూలు వ్యవహారంగా భావించింది. మాధవి చూపులు తనచూపుల్ని తాకినప్పుడల్లా పెదాలపై చిరునవ్వును ఒలికించేవాడు.

చూపులతో తనని కొరుక్కు తినడం గమనించిన మాధవి, రవి ఆలోచనలకి, చేష్టలకి చురక పెట్టాలనుకొంది. స్కూలుటీచరు కదా.. పిల్లల ద్వారా రవి గురించి ఆరా తీసింది. తాను విన్నదానికి, రవి ప్రస్తుత ప్రవర్తనకి తేడా వుంది. చాలాసేపు ఆలోచించింది. కారణం దొరకలేదు. సరే! ఏదైతే కానీయి. రవికి బుద్ధి చెప్పాలన్న నిర్ణయానికి వచ్చింది. అదనుకోసం ఎదురు చూస్తోంది.

ఒక మాదిరి గ్రామం అది. అటు పట్టణమూ కాదు. ఇటు పల్లే కాదు. మధ్యస్తంగా వుండే ఊరది. రెండే రెండు సినిమా హాళ్ళున్నాయి. ఎక్కువగా పాత సినిమాలు, పట్టణాలలో ప్రదర్శించిన తర్వాత వచ్చే కొత్త సినిమాలు ఆ ఊళ్ళోకి వస్తుంటాయి.

ఒకరోజు సాయంత్రం అనుకోకుండా మాధవి సినిమాకి వెళ్ళింది, తను ఒక్కర్తే. ఇంకా టిక్కెట్లు అమ్మడం లేదు. ఏమీ తోచక, అటు ఇటూ చూస్తున్న మాధవి కళ్ళల్లో పడ్డాడు రవి. రవికూడా సినిమాకి వచ్చాడు. అతనితో పాటు మరో ముగ్గురు నిలుచుని వున్నారు. ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. బహుశా, స్నేహితులై వుంటారని అనుకొంది మాధవి. నిజానికి స్నేహితులే.ఇదే మంచి అదను అనుకొంది మాధవి. ప్రక్కవాళ్ళని గమనించనంతగా మాటల్లో మునిగి పోయిన రవి దగ్గరకి వచ్చింది మాధవి.

"ఏమండీ! రవిగారూ!" పిలిచింది మాధవి. ఉలిక్కిపడి, తల అటువైపుగా తిప్పాడు రవి. ఏముంది మాధవి. నిర్ఘాంతపోయాడు. ఆమె అక్కడ ప్రత్యక్ష మౌతాదని ఎప్పుడూ ఊహించలేదు. కనిపించినా, ఆమె తనదగ్గరికి వచ్చిపలకరిస్తాదని ఎలా అనుకుంటాడు. పైగా, ఆమెతో ఎప్పుడూ మాట్లాడనైనా మాట్లాడలేదు. తనపేరు ఆమెకెలా తెలిసింది. ఎందుకు నన్ను పిలిచింది. ఏమి మాట్లాడతాదో. ఆమె తనకి పరిచయం వుందని అందరూ అనుకుంటారేమో.... ఈ విషయం భార్య వరకు పోతే...ఇంతకీ ఆమెతో ఏమి మాట్లాడాలి... అని తనలో తను అనుకుంటుండగానే, ఇదేం పనండి! నన్ను "నిన్నే పెళ్ళాడతా" సినిమాకి రమ్మని, మీరు "దొరికితే దొంగలు" సినిమాకి వస్తారా? ప్రశ్నించింది మాధవి. రవికి కంగారు ఎక్కువైంది. ముఖం మీద చెమట పేరుకొంటోంది.

ఇంతలో మళ్ళీ మాట్లాడరేం రవిగారు. ఇప్పటి వరకు అక్కడ చూసిచూసి, నేను పొరపాటుగా విన్నానేమో అని ఇక్కడికి వచ్చాను. అంది మాధవి. నోటి లోంచి మాటపెగలడంలేదు రవికి. స్నేహితులు, వాళ్ళిద్దరి వంక ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. అందరి హృదయాల్లోను మచ్చలేని మాణిక్యంగా కనిపించే రవి, ఏమి చేయాలో, ఏమి మాట్లాడాలో తెలియని అయోమయ స్థితిలో ఉండిపోయాడు. అవస్థ గమనించిన మాధవి మీ తప్పు తెలుసుకున్నారనుకుంటాను, అని వెళ్ళిపోయింది. ★

## పుస్తకావిష్కరణ వేదిక

**విజయవాడలో పుస్తకావిష్కరణ అభిలషించే రచయితలకు ఆహ్వానం**

'చినుకు-శ్రీ వాగ్దేవి' సంయుక్తంగా ప్రగతిశీలసాహిత్యగ్రంథాల ఆవిష్కరణోత్సవానికి సహకారాన్ని అందిస్తున్నాయని తెలియచేస్తున్నాం. ఉత్సాహం ఉన్న రచయితలు చినుకు సంపాదకవర్గాన్ని సంప్రదించండి